క్లుప్తంగా

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



అంధ విద్యార్థికి చెక్ అందజేస్తున్న విద్యా ప్రసన్న, ప్రిన్సిపాల్

కపిలేశ్వరపురం (మండపేట): భారత రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆధ్యాపకులు ఎస్.రాంబాబు, డాక్టర్ జె.నెహ్రూ నాయక్ పర్యవేక్షణలో శనివారం నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆలమూరు బార్ అసోసియేషన్ కోశాధికారి బి.విద్యా ప్రసన్న మాట్లాడుతూ రాజ్యాంగ అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని చాటి చెప్పిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పోటీల్లోని విజేతలకు ప్రముఖుల చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. వక్త బి.విద్యా ప్రసన్న ఆధ్వర్యంలోని ఉమెన్ ఎంపవర్‌మెంట్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా కళాశాలలోని అంధ విద్యార్థులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎ.ఆనందరావు, అధ్యాపకులు వెంకన్న, డాక్టర్ మధు కుమార్, సుందర్, అభినయ్, బాబురావు, చంటిబాబు, శాంతకుమారి, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

పాలడుగు కుటుంబానికి జేపీ పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు, సంఘ సేవకురాలు డాక్టర్ పాలడుగు సత్యవతి (87) ఈ నెల 22న తుదిశ్వాస విడిచారు. ఆమె కుటుంబ సభ్యులను శనివారం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ పరామర్శించారు. మండపేట సమీప ప్రాంత పేద ప్రజలకు సత్యవతి, చంద్రమౌళి దంపతులు వైద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలందించారన్నారు. సత్యవతి ఆలోచనలు, జీవన అనుభవాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన వెంట కాకినాడ రెడ్‌క్రాస్ అసోసియేషన్ చైర్మన్ వైడీ రామారావు, సిద్ధార్థ బక్స్, ఇనపకోళ్ల శ్రీహరి వెంకటేశ్వరరావు, గణేష్, లయన్ దాసరి తిరుమలరావు ఉన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సంఘ సభ్యులు

కాజులూరు: కాజులూరులో శనివారం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరవర్మ, జిల్లా నాయకులు ఐ.ప్రసాదరావు, సాపే శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించగా అధ్యక్షుడిగా వి.భానుప్రకాశ్, గౌరవాధ్యక్షుడిగా ఐ.శుభాకర్, సహాధ్యక్షుడిగా జి.బుజ్జిబాబు, డి.మున్నీకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.గణేష్, సహాయ కార్యదర్శులుగా ఆర్.పాండురంగారావు, సలాది శ్రీనివాసు, ట్రెజరర్‌గా ఆర్.సుధాకర్, మహిళా కార్యదర్శిగా కె.అమ్మాజి, పలువురు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేశారు.

700 లీటర్లు బెల్లపు ఊట ధ్వంసం



వీధివారిలంకలో పట్టుకున్న సారా, తయారీ సామగ్రితో ఎస్ఈబీ పోలీసులు

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలో శనివారం సారా బట్టీలపై ఎస్ఈబీ పోలీసులు దాడి చేశారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో పోలీసులు అక్రమంగా దాచిన 700 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. 15 లీటర్ల సారా, సారా తయారీకి ఉపయోగించే స్టవ్, గ్యాస్ సిలిండర్, యానాం నుంచి తెచ్చిన మద్యం బాటిళ్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. నాలుగు కేసులు నమోదు చేసినట్టు ఎస్ఈబీ పోలీసులు తెలిపారు. దాడుల్లో అమలాపురం ఏఈఎస్, ఇంటెలిజెన్స్ డీటీఎఫ్, ఆలమూరు, కొత్తపేట, రామచంద్రపురం ఎస్ఈబీ పోలీసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మలికిపురం: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందింప చేసుకోవాలని రాజోలు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీల రాణి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షతన ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యాన రాజ్యాంగ రూపకల్పనకు జరిగిన కృషిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రిసోర్స్ పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల రాణి ముఖ్య అతిథిగా మాట్లాడారు.

తీరనున్న ప్రజల కష్టాలు

- తాగునీటి అవసరాలపై మంత్రి వేణు ప్రత్యేక దృష్టి
- నియోజకవర్గంలో 89 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం
- 36,348 కుళాయి కనెక్షన్లు
- చురుగ్గా నిర్మాణాలు



వెంకటాయపాలెం శివారు దాసరపాడులో నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంకు



నరసాపురపుపేటలో శరవేగంగా జరుగుతున్న పైపులైన్ ఏర్పాటు

రామచంద్రపురం: ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేలా జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో వాటర్ ట్యాంకులు, కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల తాగునీటి సమస్యపై రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శ్రద్ధ తీసుకొని ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు చేయించి పనులను ఆర్ డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో పూర్తి చేయిస్తున్నారు.

నిధుల మంజూరుతో..

ఎన్నికలకు ముందు ప్రతీ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను అప్పట్లో మంత్రి వేణు గుర్తించారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రామానికి రక్షిత మంచినీరు ఇవ్వాలన్న సంకల్పంతో అధికారులతో చర్చించి ప్రణాళికలు తయారు చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జల జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గానికి రెండు విడతలుగా రూ. 67.61 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు మొదలు పెట్టి చురుగ్గా సాగుతున్నాయి.

మండలం	గ్రామాలు	నిధులు (రూ. కోట్లలో)	కుళాయి కనెక్షన్లు	ఓవర్ హెడ్ ట్యాంకులు
రామచంద్రపురం	25	25.26	11092	28
కాజులూరు	26	27.33	18718	21
కె.గంగవరం	26	15.07	6538	30
మొత్తం	77	67.61	36348	89

ప్రతీ ఇంటికీ రక్షిత మంచినీరు



నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేసి నిధులు మంజూరు చేయించాం. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తాం. అదే విధంగా నియోజకవర్గంలోని 77 గ్రామాలకు రక్షిత మంచినీరు అందించే లక్ష్యం త్వరలో సాకారం కాబోతోంది.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రి

చురుగ్గా నిర్మాణ పనులు



జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిచేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వచ్చే వేసవి నాటికి లక్ష్యం అందుకునే ప్రణాళికతో పనులు వేగంగా పూర్తి చేస్తున్నాం.

– ఏజీ రామారావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, రామచంద్రపురం

ఘనంగా లక్షపత్రి పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

కె.గంగవరం: స్థానిక అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం లక్ష పత్రి, లక్ష బిల్వార్చన, గణపతి హోమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 27న ఆలయం వద్ద వన సమారాధన చేస్తామని కమిటీ సభ్యులు తెలిపాలి.

మంత్రి వేణు పరామర్శ



ప్రకాశ్‌ను పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ వైఎస్ఆర్ సీపీ నేత చెల్లుబోయిన ప్రకాశ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల ఏరియా ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రకాశ్ ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైఎస్ఆర్ సీపీ నేతలు కంచుమర్తి బాబూరావు, కుడిపూడి గణేష్, సూరంపూడి సుబ్రహ్మణ్యం తదితరులున్నారు. అనంతరం డాక్టర్ వీరభద్రుడితో ఆసుపత్రిలో రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

కనువిందుగా జనార్దనుడి తెప్పోత్సవం



తెప్పోత్సవంలో ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని అంకసాని చెరువులో శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ జనార్దన స్వామి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కనువిందుగా సాగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు దేవతామూర్తులను దర్శించుకున్నారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పట్టణంలోని భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూకదుర్గారాణి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ ఎస్.జయబాబు, సభ్యుల పర్యవేక్షణలో రథం గుడి నుంచి ఉత్సవ మూర్తులను వేద మంత్రోచ్చరణలతో గ్రామోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, వినోద కార్యక్రమాలు అలరించాయి. విద్యుత్ దీపాలంకరణ కనువిందు చేసింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు రెడ్డి రాజుబాబు, యువనాయకులు తోట పృథ్వీరాజ్, పిల్లి గణేశ్వరరావు, యాంద్ర ప్రభాకరరావు, సిరంగు శ్రీనివాస్, కుక్కల రామారావు, సలాది అన్నవరం, ఓగిరాల దేవి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

10న వైఎస్సార్ సీపీ వనసమారాధన



వనసమారాధన ప్రతిపాదిత ప్రదేశంలో పూజ చేస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): డిసెంబర్ 10న పట్టణ పరిధిలోని గొల్లపుంత రోడ్డులో గల లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణుల కార్తిక వన సమారాధన నిర్వహించనున్నారు. ఆ మేరకు ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం పరిశీలించారు. పార్టీ నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రెడ్డి రాధాకృష్ణ తదితరులతో కలిసి పరిశీలించారు. నిర్వహణ పనులను ప్రారంభిస్తూ పూజ చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పుణ్యప్రదమైన కార్తిక వన సమారాధన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా నియోజకవర్గ స్థాయిలో మమేకమవుతారన్నారు. సుమారు 70 వేల మంది హాజరయ్యేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన ప్రతినిధులంతా కార్తిక వనసమారాధనకు హాజరయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంకా బాబ్జి, కాళ్లకూరి నాగబాబు, కొమ్ము రాంబాబు, బూరిగ ఆశీర్వాదం, పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను), తోట పృథ్వీరాజ్, మెండు బాపిరాజు, కుడిపూడి రాంబాబు, ముమ్మిడి వరపు బాపిరాజు, నాయకులు జిన్నూరి సాయిబాబా, దూలం చక్రవర్తి పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయుని ఆలయ వార్షికోత్సవం



గొలకోటివారి పాలెంలో స్వామికి పూజలు చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కొత్తపేట: మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గొలకోటి మాధవ్ ఆధ్వర్యాన తెల్లవారు జాము నుంచీ వేదపండితులు ముళ్లపూడి రామకృష్ణ పర్యవేక్షణలో విశేష పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో కలెక్టర్ హిమాన్షుశుక్లా ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తొలుత కలెక్టర్‌కు మాధవ్, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ గొలకోటి నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సంకీర్తన, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాట్యకళాకారిణి అలేఖ్య కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అన్నసమారాధన జరిపారు. బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాలు, హనుమంతుడు, శ్రీరామపట్టాభిషేకం ప్రదర్శన, విచిత్ర వేషధారణ, బుట్టబొమ్మలతో భారీ ఊరేగింపు అందరినీ అలరించాయి.

సామాజిక చైతన్యమే ప్రగతి మార్గదర్శకం

ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



తాపేశ్వరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ

కపిలేశ్వరపురం (మండపేట): సామాజిక చైతన్యమే మానవ ప్రగతికి మార్గదర్శకం అవుతుందని, ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో సంఘ చైతన్యాన్ని కలిగి ఉండాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. మండపేట మండలం తాపేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల శాఖ మహా సభ నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు మైపాల త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు ఎమ్మెల్సీ ఐవీతో పాటు సంఘం రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, మండపేట, ఆలమూరు ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, శాలెం రాజు, సోమిరెడ్డి అతిథులుగా హాజరయ్యారు.

ఎమ్మెల్సీ ఐవీ మాట్లాడుతూ విద్యా బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని కల్పించేలా ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశంలో విద్యారంగాన్ని యూటీఎఫ్ కాపాడుకుంటూ వస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం తీరుతో విద్య కాషాయీకరణ అవుతోందన్నారు. మత ప్రభావాలకు అతీతంగా రాజ్యపాలన, విద్యా బోధన ఉండాలన్న రాజ్యాంగ మౌళిక సూత్రాన్ని నేటి పాలకులు తుంగలోకి తొక్కుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని కాపాడే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. సామాజికాభివృద్ధికి విశేష కృషి చేసిన పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ అధ్యక్షులు పి సురేంద్ర, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ కే.గోపాలకృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు తాడి శ్రీనివాస్, గొడవర్తి సుధాకర్, జి.రాజు, గంటి వీర్రాజు, సీతాదేవి, పనసయ్య, చింతపల్లి ప్రసాద్, రాజమండ్రి రమణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ప్రగతి సాధ్యం



కె.గంగవరంలో బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పంపన నాగమణి, పెట్టా శ్రీనివాస్ తదితరులు

కె.గంగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఎంపీపీ పంపన నాగమణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా కె.గంగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న సీఎం జగన్‌కు మళ్లీ అధికారంలోనికి వచ్చేలా ఆశీర్వదించాలని ఆయన కోరారు. తొలుత గ్రామంలో అమలు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, సర్పంచ్ కోటి లక్ష్మీ నసమ్మ కలసి ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి సూర్యచంద్ర రాజశేఖర్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీనివాస్, వ్యవసాయ సలహా కమిటి జిల్లా సభ్యులు బత్తుల అప్పారావు, సొసైటి అధ్యక్షులు ఈదర రమేష్, ఎంపీటీసీ పెద్దరెడ్డి నాగ వెంకట తులసి, సర్పంచ్ పంపన సత్యానందం, చిల్లే నాగేశ్వరరావు, కన్వీనర్ కోటి రమేష్, వల్లూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో షూటింగ్ సందడి

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టుపై శనివారం రాత్రి సినిమా షూటింగ్ జరిగింది. జీఏ 2 పిక్చర్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై నిర్మిస్తున్న సినిమాలో భాగంగా హీరో, హీరోయిన్‌లు నార్నే నితిన్, నయన్ సారికలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. అంతకుముందు ఉలిశెట్టివారిపాలెం చెరువు వద్ద షూటింగ్ జరిగింది. గత 48 రోజులుగా కోనసీమలోని పలు ప్రాంతాల్లో సినిమాను చిత్రీకరిస్తున్నట్టు డైరెక్టర్ అంజిబాబు కంచిపల్లి తెలిపారు. అల్లు అరవింద్ సమర్పణలో నిర్మిస్తున్న ఈ షూటింగ్ ఇప్పటి వరకూ 80 శాతం పూర్తయిందన్నారు. సినిమా నిర్మాత బన్నీ వాసు, తారాగణం వినోద్‌కుమార్, కశిరెడ్డి రాజ్‌కుమార్, అంకిర్ కొయ్య, మైమ్ గోపి తదితరులు ఉన్నారు. పాటలు కాసర్ల శ్యామ్, శ్రీమణి, కెమెరామెన్ సమీర్‌కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల ఉన్నారు.

హోరాహోరీగా బాస్కెట్ బాల్ పోటీలు



తూర్పుగోదావరి, చిత్తూరు జిల్లాల బాలికల జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న పోరు

- బాలుర విభాగంలో ఫైనల్స్‌కు పశ్చిమ, కృష్ణా జిల్లాల జట్లు
- నేడు బాస్కెట్‌బాల్ ఏపీ టీమ్ ఎంపిక

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని కాయల సూరారెడ్డి బాస్కెట్ బాల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీలు శుక్రవారం ప్రారంభమైన విషయం పాఠకులకు విదితమే. లీగ్ దశ పోటీల్లో బాలికల జట్ల మధ్య నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు కడప జట్టుపై విజయం సాధించగా, తూర్పుగోదావరి జిల్లా జట్టు విశాఖపట్నంపై, పశ్చిమగోదావరి జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై, గుంటూరు జట్టు విజయనగరంపై, కృష్ణా జిల్లా జట్టు అనంతపురం జట్టుపై విజయం సాధించాయి. ఇక బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు ప్రకాశం జిల్లాపై, పశ్చిమగోదావరి జట్టు కడపపై, తూర్పుగోదావరి జిల్లా జట్టు కర్నూలుపై, గుంటూరు జిల్లా అనంతపురంపై, నెల్లూరు జిల్లా జట్టు శ్రీకాకుళంపై విజయం సాధించాయి. నాకౌట్ దశ పోటీల్లో లీగ్ దశ అనంతరం నాకౌట్ దశకు చేరుకున్న బాలురు, బాలికల జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో ఎనిమిది టీమ్‌ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. కృష్ణా, చిత్తూరు మధ్య జరిగిన పోరులో కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా జట్లు, వైఎస్సార్ కడప జట్ల మధ్య జరిగిన పోటీల్లో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కర్నూలు జట్ల మధ్య జరిగిన పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు, గుంటూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగిన పోటీల్లో నెల్లూరు జట్టు విజయం సాధించాయి. నాకౌట్ దశలో బాలికల జట్ల మధ్య జరిగిన పోటీల్లో గుంటూరు జట్టు విశాఖపట్నంపై విజయం సాధించింది. కృష్ణా, నెల్లూరు జరిగిన మ్యాచ్‌లో కృష్ణా జట్టు విజయం సాధించింది. పశ్చిమగోదావరి, అనంతపురం మధ్య జరిగిన మ్యాచ్‌లో పశ్చిమగోదావరి జట్టు పైచేయి సాధించింది. నాకౌట్‌లో విజయం సాధించిన జట్ల మధ్య జరిగే పోటీల్లో విజేతలైన జట్లు సెమీస్‌కు చేరతాయి. కడపటి సమాచారం అందేసరికి బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఈ పోటీలకు రిఫరీలుగా నాగరాజు(కృష్ణా), వర్మ(తూర్పుగోదావరి)లు వ్యవహరిస్తున్నారు. సెమీ ఫైనల్‌లో విజేతలైన జట్ల మధ్య ఫైనల్ పోరు ఆదివారం మధ్యాహ్నం జరిగే అవకాశముంది. ఫైనల్ పోటీల అనంతరం రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేస్తారు. ఆదివారం సాయంత్రం అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు ముగింపు కార్యక్రమం జరగనుంది.

త్వరగా రబీ పనులు పూర్తి చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్



చేదువాడలో దాళ్వా సాగుపై రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ అశోక్

రాయవరం: ఖరీఫ్ సాగు పనులు త్వరగా ముగించుకుని రైతులు రబీ వరినాట్లకు సిద్ధం కావాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ సూచించారు. మండలంలోని వి.సావరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు రబీ పంటపై శనివారం అవగాహన కల్పించారు. డిసెంబరు 31వ తేగా రబీ వరి నాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. రబీ వరినాట్లలో భాగంగా వెదజల్లు విధానానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ విధానంలో వరినాట్లు వేసుకునే వారు డిసెంబరు 15 లోగా పూర్తి చేయాలన్నారు. నాట్లు వేసుకునే వారు డిసెంబరు 31 తేదీ లోపు పూర్తి చేసుకోవాలన్నారు. అవగాహన సమావేశంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిరికి కృష్ణారావు, గ్రామ ఉద్యానవన సహాయ సంచాలకులు ఐశ్వర్యదేవి పాల్గొన్నారు.

దాళ్వా సాగుపై అవగాహన

కాజులూరు: వచ్చే మార్చి 31 నాటికి దాళ్వా సాగు పూర్తయ్యేలా రైతులు ప్రణాళిక తయారు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించి దాళ్వా సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చేదువాడలో ఆయన మాట్లాడుతూ ఈ ఎడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేస్తునట్టు నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించారన్నారు. అయితే ఈ ఏడాది మండల గ్రామాల్లో తొలకరి మాసూళ్ల పనుల్లో తీవ్ర జాప్యం జరుతుందని కనీసం డిసెంబరు మొదటి వారం నాటికైనా మండలంలో పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాలన్నారు. లేకుంటే దాళ్వా పంట చివరి దశలో సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడతాయన్నారు.

కళాశాలలో ఆకస్మిక తనిఖీ

రావులపాలెం: స్థానిక జూనియర్ కళాశాలను జిల్లా డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని ప్రతీ క్లాస్ రూమ్‌కి వెళ్లి గతంలో జరిగిన మూడు యూనిట్ల అర్ధ సంవత్సర పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. రాబోవు రోజుల్లో జరిగే పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి పలు సూచనలు చేశారు. కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులకు వులు సూచనలు చేశారు. అలాగే నాడు–నేడు పనులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లో చెత్త డంపింగ్ వద్దు

అంబాజీపేట: నివాస ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేయవద్దని, పంచాయతీ అధికారులు చెత్త పంపిస్తే అడ్డుకుంటామని హడ్కోకాలనీ, నెల్లివారిపేట వాసులు అన్నారు. అంబాజీపేట హడ్కో కాలనీకి వెళ్లే రహదారిలో కాలనీల వాసులు శనివారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో చెత్తను తరలించి డంపింగ్ చేయడం వల్ల చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కాలనీల శివారు ప్రాంతంలో చెత వేయవద్దని అధికారులకు, ఎంపీ, ఎమ్మెల్యే, మాచవరం పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్లతో చెత్త తీసుకొస్తే అడ్డుకుంటామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్‌ను నిలిపివేయాలని స్థానికులు నెల్లి బాలరాజు, ముమ్మిడివరపు వరప్రసాద్, క్రాప భాస్కరరావు, గోడి భాగ్యలక్ష్మి, గెద్దం త్రివేణి తదితరులు అన్నారు.

కె.పెదపూడిలో చోరీ

అంబాజీపేట: ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు అపహరించుకునిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కె.పెదపూడికి చెందిన నూనె వెంకటలక్ష్మి ఈ నెల 24న తన పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లింది. తిరిగి శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించింది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలు పగలగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడేసి, లోపల ఉన్న కాసు సూత్రాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.